సింగిల్ పేజీ కథ

# ప్లాన్

**కే. శ్రీవాణి**

నాన్నా,

మీరు ఎన్నివిధాల చెప్పినా శ్రీనుతో నా పెళ్ళికి అంగీకరించలేదు. మీకేమో పరువూ, ప్రతిష్ఠలు కావాలి! నాకు శ్రీను కావాలి! అందుకే నేను శ్రీనూతో వెళ్ళిపోతున్నా. ఈ నా తప్పును క్షమిస్తారనే ఆశతో...

-పద్మజ

మళ్ళీ మళ్ళీ చదివారు పరంధామయ్య ఆ ఉత్తరాన్ని. ఆయనకి శ్రీను, వాళ్ళ అమ్మగార్ని తీసుకొని వచ్చిన రోజు జ్ఞాపకం వచ్చింది. "మీ పద్మకు పెళ్ళి చేయరా?" అడిగింది శ్రీను తల్లి



"పెళ్ళంటే మాటలా... ఎన్ని చూడాలి! కులం, గోత్రం ఇలా అన్నీ కుదిరినా కట్నాలు కూడా కుదరాలిగా!" అన్నారు పరంధామయ్యగారు.

"ఈ రోజుల్లో కూడా పట్టింపు లేంటండీ! కాలంతోపాటు మనమూ మారాలి!" అన్నది.

"ఏమిటే మీరనేది?" అన్నాడు అర్ధంగాక.

"ఏమీ లేదండీ! మా అబ్బాయిని మీ అల్లుడిగా చేసుకోండి. పైగా పిల్లలూ ఇష్టపడుతున్నారు!" అంది అసలు విషయాని కొస్తూ...

"చాలు... చాల్లేమ్మా...! పెద్ద చెప్పొచ్చావు. వాళ్ళకు సర్ది చెప్పాల్సింది పోయి... తగుదునమ్మా అంటూ వచ్చావా? వెళ్ళు, వెళ్ళు...' ' అంటూ చిర్రు బుర్రు లాడారు ఆయన.

"నామాట విన్నారు కాదు! ఇప్పుడు చూడండి! ఏం జరిగిందో!? మనం తలెత్తుకుని తిరగ్గలమా! రేపటి నుండి? మీరు మొదటి నుండీ ఇంతే! ఎవ్వరి మాటా వినరు! ఎప్పుడూ మీకు మీ మాటే చెల్లాలనే పంతం!" అంటూ అరుస్తున్న జానకమ్మ మాటలకి వాస్తవంలోకి వచ్చారు పరంధామయ్య.

ఎవరికోసమూ ఆగనిది కాలమొక్కటే.

పద్మజ వెళ్ళిపోయి అప్పటికే నెలలు గడిచాయి.

ఆటో దిగి సరాసరి లోనికొస్తున్న పద్మజని చూసి ఒక్క గావుకేక పెట్టింది జానకమ్మ.

"ఏంటే... ఏంటా అరుపులు? పిచ్చేమైనా..." అంటూ అక్కడికి వచ్చిన పరంధామయ్య మాట గేట్లో పద్మజని చూస్తూనే ఆగిపోయింది. ఏమాత్రం జంకు లేకుండా భర్తతో ఇంట్లో కాలు పెట్టింది పద్మజ.

ఇది ఎవ్వరూ ఊహించని పరిణామం... కిమ్మనకుండా ఆహ్వానించారు ఆ నూతన దంపతులను.

ఆ రోజు రాత్రి వరండాలో...

"ఏవండీ నాకో అనుమానం! ఎంతో సాంప్రదాయమైన కుటుంబంలో పుట్టిన మన అమ్మాయి వెళ్ళిపోయినా మీరు కిమ్మనకపోవటం... వెళ్ళిపోయిందిలే అనుకున్న పిల్ల మళ్ళీ వచ్చినా మీరు పల్లెత్తు మాటనకపోవటం... ఇదంతా నాకు కలలా ఉంది." అంటూ ధర్మ సందేహాన్ని బయటపెట్టింది జానకమ్మ.

"నేను చెప్పేది నీ బుర్రకు అర్థం కాదు?" అన్నారు పరంధామయ్య.

"అర్థమయ్యేలా చెబితే ఎవరికైనా అర్థమవుతుంది కదా!" "శ్రీను వాళ్ళమ్మ అడగ్గానే నేనూ ఒప్పుకొని ఉంటే ఏమయ్యేది! ఆలోచించు!" అన్నాడు. "ఆ... ఏమవుతుంది? పండక్కి అమ్మాయినీ, అల్లుణ్ణీ తీసుకొచ్చే వాళ్ళం" అంది దిగులుగా.

"ఆ... అక్కడే ఉంది చిక్కంతా"

"చిక్కేంటి!?" అడిగింది అర్ధాంగి.

"అవునమ్మా చిక్కే! మా పెళ్ళి మీ అనుమతితోనే జరిగి ఉంటే మొదటి పండక్కి మీరు స్కూటరో, బట్టలో, ఇంకేవో... ఇచ్చి మీ అల్లుని కోరికలు తీర్చాల్సి వచ్చేది! ఇలా పెళ్ళి చేసుకోటం వల్ల మీకు ఆ ఖర్చు తప్పుతుంది నాకూ ఏ సతాయింపులూ ఉండవు!" అంది అప్పుడే వచ్చిన పద్మజ.

"ఆ!..." అంటూ నోరెళ్ళబెట్టింది కూతురి తెలివికి...

"ఇంకో సంగతి... ఈ ప్లాన్‌లో నాన్నకు భాగం ఉంది!" అంది ముసిముసిగా నవ్వుతూ పద్మజ.

శృతి కలిపారు పరంధామయ్య...

★ ★ ★